**మూడువారాల కథ** ...రెండవ వారం

# అస్పృశ్య గంగ

**ఆకాశం నిర్మలంగా వుంది. నక్షత్రాలు మినుకు మినుకుమంటున్నాయి. రేపు సూర్యోదయ మవుతుందని ఈ నక్షత్రాలే హామీ ఇస్తున్నాయి. ఇప్పటి ఈ చీకటి ఇలాగ్గే వుండదని అనిపించిన వెంటనే ఈ కష్టాలూ కలకాలం వుండవని ఓదార్పు కలిగింది. కష్టాల్ని కోరి నెత్తికెత్తుకున్నానే అని వినాయక్ క్షణకాలం అనుకోక పోలేదు.వెంటనే ఎత్తుకోక తప్పదని అనుకున్నాడు. కర్మణ్యే వాధి కరస్తే అనీ అనుకున్నాడు.**

**జీవించటం అంటే బాధ్యతలు భరించటమే – పారిపోవటం సాధ్యం కాదు. ఎంత దూరం పారిపోవటం? ఎంత కాలం పారిపోవటం? ఎవరి కోసం పారిపోవటం? పారిపోతూ బతకటమెందుకు? తాడోపేడో జీవితాన్ని ఎదుర్కొంటేనే తేలిపోతుంది.**

ఈ బావి కష్టం- నష్టం ఎంతో కాలం బాధించవు. నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయం నుంచి తవ్వడం ఆరంభమయింది. కష్టం వస్తే- బండ పడితే మళ్లీ ప్రారంభించటానికి ఆ నిర్ణయమే కారణమయింది.

భార్యాభర్తలిద్దరికీ వచ్చే జీతం ఆరునూర్లు. అందులోనే ఇల్లు గడవాలి. తల్లిదండ్రులకు పంపాలి. పిల్లల చదువుల ఖర్చు చేయాలి. వడ్డీ కట్టాలి. పది వేలు అప్పు. ఎంత లేదన్నా బావికి రెండువేలు ఖర్చు. ఖర్చులో ఖర్చు. తీర్చగలమన్న ధీమా! అప్పు మీద అప్పు. పెరుగుతున్న వడ్డీ. సరే కానియ్‌మని పట్టుదల. తీర్చగలమని విశ్వాసం. అ విశ్వాసమే, మొండితనమే ఇల్లుగా మారింది. బావిగా మొదలయింది. బండగా రూపెత్తింది.

గోవిందు గజం తాడు అర్ధ వ్యాసంతో వృత్తం గీశాడు. ఇది బావి అన్నాడు. దండం పెట్టాడు. టెంకాయ కొట్టాడు. పూలు పెట్టాడు. అగరొత్తులు వెలిగించాడు. పప్పులు బొరుగులు, బెల్లం ముక్కలు పిల్లలకు పంచి పెట్టాడు. తానిన్ని బొక్కాడు. తన భార్యకిన్ని ఇచ్చాడు.

టెంకాయ నీళ్లు పడ్డ చోట గునపంతో గుచ్చాడు. గడారుతో పొడికాడు, గుద్దలితో నరికాడు. పికాసితో గుచ్చాడు. పారతో తవ్వాడు. గమేళాలోకి ఎత్తాడు. నెత్తికెత్తుకున్నాడు. వృత్తం చుట్టూ తిరిగాడు. దూరంగా మట్టి వేసి వచ్చాడు.

పనికి వంగిన గోవిందు మళ్లీ మాట్లాడ లేదు. నడుం ఎత్త లేదు. మట్టి తవ్వుతున్నాడు, గంపకెత్తుకున్నాడు. భార్య తలకెత్తుతున్నాడు. ఆమె దూరంగా పోసి వస్తూ వుంది. రోజూ ఇదే పని.

గోవిందు తెల్లవారు జామున వచ్చేవాడు. వెంట కొడుకు వుంటాడు. సూర్యోదయానికి ముందే చాలా పని ముగించుకునే వాడు. వుదయమే భార్య వచ్చేది. వస్తూ సద్ది తెచ్చేది, సద్ది మూట. నీళ్లకుండ గంపలో పెట్టుకుని, గంపనెత్తిన పెట్టుకుని, గంప పట్టుకోకుండా ఆమె నడుస్తూంటే చూడాలి. అంత సుకుమారంగా ఆడవాళ్లు- కష్టజీవులు- అంత శరీరంతో అంత సునాయాసంగా అందంగా నడుస్తారని లోకానికి తెలియదు. ఎంత బరువు ఎత్తుకున్నా, ఎంత శ్రమ చేస్తున్నా, అంత సుకుమారంగా నడవటం ఆశ్చర్యంగా వుండేది.

## జరిగిన కథ

వినాయక్ లెక్చరర్. భార్య టీచరు. వినాయక్ మాదిగ కులస్థుడు. భార్యా బిడ్డల్ని పోషించుకుంటూ తపోవనంలో అప్పోసప్పో చేసి ఇల్లు కట్టుకుంటాడు. తాగునీటి సమస్యతో వేగలేక సొంతంగా బావి తవ్వించు కోవాలనుకుంటాడు. ఆ పనిని గోవిందుకు అప్పగిస్తాడు. అయితే బావిలో బండ పడుతుంది. ఎలాగైనా అప్పులో అప్పు చేసి బండ పగలగొట్టించు కోవాలనుకుంటాడు.

**-కొలకలూరి ఇనాక్**


నడకలో, కదలికలో, పనిలో, బరువులో మాటలో అన్నింటా ఆమె సుకుమారంగా సున్నితంగా సునాయాసంగా కనబడుతుంటే చాలా అద్భుతమనిపించేది. మహారాణుల సొగసు సోయగాలు ఆమె ప్రతి కదలికలో కనిపించేవి. చిన్నతనంలో రెడ్డిరాజులు, వడ్డె రాజులు అని విన్న మాటలు గుర్తుకు రాసాగాయి. ఈమె ఆ రాజవంశాల మహారాణుల సౌకుమార్య ప్రతినిధిగా కనిపించింది. మట్టి మనిషిగా లేదు. మహారాణిలాగా వుంది. వడ్డె రాజులు నిజంగా రాజులే అయి వుంటారని గోవిందు భార్యను చూసిన తర్వాత అనిపించింది.

గోవిందు శ్రమజీవి. పని చేస్తున్నపుడు ప్రతి వెంట్రుక పాదులో నుంచి చెమట బైటికి వచ్చేది. అలా వూరిన చెమట బిందువులయ్యేది. బిందువులు బరువై కదిలేవి. అవి సమూహ మయ్యేవి. పరిమాణం పెరిగి అవి ప్రయాణిం చేవి. అవి ప్రయాణించినంత మేర గీతలు గీసినట్టు అయ్యేది. వంగిన గోవిందు వెన్ను మీద పుట్టి, పక్కటెముకల మీద జారి, పొట్ట మీదికి వచ్చి. జారి డికాసి మీద పడే చెమట బిందువులు



హారతి పళ్లెంలో దక్షిణ వేస్తున్నట్టుగా పడేవి. భూగర్భంలోని జలం బైటికి రావడానికి స్వాగతం పలుకుతున్నట్లుగా చెమట బొట్లు బావిలో పడుతుండేవి.

చెమట పట్టిన గోవిందును చూస్తుంటే మనిషి ఇంతగా పరిణామం చెందటానికి వున్న మూలసూత్రం గోచరం కాసాగింది. చెమట పట్టిన గోవిందు శరీరం ఎంతో అందంగా కనిపించేది. శ్రమజీవి సుందరుడు. చెమట పట్టిన శరీరమే శ్రేష్ఠం. చెమట జీవే లావణ్యావంతుడు. ఆమెకు చెమట పట్టదు. ఆమె అలసిపోదు. ఆయాస పడదు. ఆమె చేసే ఏపని కూడా ఆమెకు కష్టం కాదు. ఆమె ఆడుకున్నట్లు పని చేస్తుంది. అంద పెద్ద మట్టితట్ట ఇద్దరు గొప్ప మగవాళ్లు కూడా ఎత్తలేరు. ఆమె సునాయాసంగా ఎత్తుకొంటుంది. సుతారంగా పారబోసి వస్తుంది. ఆ పని ఆమెకు చెండాట లాగా ఉంది. ఆమెకు చెమట పట్టదు.




చెమట పట్టాలంటే ఆమె ఇంకెంత పెద్ద పని చేయవలసి ఉంటుందో! ఆలోచిస్తేనే ఆశ్చర్యంగా వుంటుంది. ఎంత పెద్ద పనయినా చేగలిగే ఆరోగ్యం నిజానికి కష్టజీవుల సొంతం.

గోవిందు మొదటి మట్టు తవ్వినపుడు మట్టే వచ్చింది. రెండో మట్టులో గులక, కంకర తగిలాయి. మూడో మట్టులో గరుసు పడింది. నాలుగో మట్టులో చెమ్మ తగిలింది. 'గంగుంది సావీ' అన్నాడు గోవిందు. ఆనందమే ఆనందం.

అయిదో మట్టు పూర్తయ్యేసరికి బండ కనిపించింది. ఆ మూలా, ఈ మూలా తవ్వి తడిమి చూశాడు. బండ అఖండంగా వుంది. పెద్ద బండ. చాలా వెడల్పు! బండ మీద మట్టి కడిగినట్లు శుభ్రం చేశాడు. నున్నగా బండ తేలింది.

బండను కొట్టాడు. కోశాడు. నరికాడు. గునపం సొట్టబోయింది. గడారు వంగి పోయింది. పికాసి మొనబోయింది. కమ్మరి దగ్గర నీటిని సరి చేయించి తీసుకొని వచ్చాడు. లాభం లేదు. బండ తన పనిముక్లతో పగలదు. ఇక తవ్వలేడు.

ఒకరోజు వినాయక్ కాలేజీనుంచి వచ్చేసరికి గోవిందు బండ మీద పడుకుని వున్నాడు. చెవిని బండకు ఆనించి సిస్తంత్రీ సమాచారం వింటున్నాడు. దూరవాణి తిలకిస్తున్నాడు. విని సంతోషంగా కూర్చున్నాడు. పైకి చూశాడు. తాడు పట్టుకుని బావి అంచు గుంటల్లో కాళ్లు పెట్టుకుంటూ చెకాచికి ఎక్కి పైకి వచ్చి 'సావీ' అన్నాడు. 'గంగుండాది.' అన్నాడు. 'తల్లుండాది. నేనొత్తాననే నాకు జెప్పె. నేనింటి. ఇపుడే ఇనింటి'. గంగ వుందని, అరడుగు కింద వుందని ఆ మాత్రం బండ తొలిగిస్తే నీరు తన్నుకొంటూ పైకి వస్తుందని గోవిందు ఆనందంగా చెప్పాడు.

అరడుగు బండ పగలగొట్టాలి. తూటా పేల్చవచ్చు. మిషను పెట్టటం ఖర్చు. తూటాలతో పేల్చటం సులభం. అంత ఖర్చు కాదు. కొంత మేలు. అయినా ఖర్చే. అందుకే భయమయింది. పని ఆపక తప్పలేదు. శుక్రవారం చేసినంత వరకు బట్వాడా ఇచ్చాడు. పని కొంచం ఆపక తప్పదన్నాడు వినాయక్. పని చేయటానికి గోవిందు ఆరాట పడుతున్నాడు. బావి తవ్వుతున్న మొదటి రోజుల్లో గోవిందు భార్య సద్ది తెస్తూ నీళ్లు తేవటం వినాయక్ గమనించక పోలేదు. తాగటానికి నీళ్లు ఇవ్వమనుకుందా, ఇవ్వలేమనుకుందా, ఆ కష్టం వాళ్లకెందుకనుకుందా, వాళ్లింట్లో నీళ్లు తాగరాదనుకుందా, ఏమనుకొందామె అని మధన పడ్డమాట నిజం.

మండి పోతున్న ఎండలకు నీళ్లన్నీ తాగేసిన గోవిందు మళ్లీ నీళ్లు కావాలంటే లేవని చెప్పిన భార్య ఎండలో వెళ్లి వేపచెట్టు పక్క బావిలో నీళ్లు తోడి తెచ్చి ఇచ్చింది. గోవిందు తాగాడు. ఆ రోజు ఆదివారం. అందరూ ఇంట్లోనే వున్నారు. నీళ్లిమ్మంటే ఇచ్చేవాళ్లు. అడగలేదు.

గోవిందు భార్యతో రోజు పని ముగించుకుని ఇంటికి వెళుతున్నపుడు గోవిందుతో వినాయక్ చెప్పాడు. 'నీళ్లు కావాలంటే ఇంట్లో వున్నాయి. తెచ్చుకుని తాగండి.' వాళ్లు ముఖం ముఖం చూసుకున్నారు. 'సరే' అనలేదు. 'మీ నీళ్లు మేమెట్లా తాగుతామూ' అనలేదు. 'అట్టాగే సావీ' అనలేదు. 'వూ' అన్నాడు. అన్నాడే కానీ ఎపుడూ నీళ్లడగ లేదు. తాగలేదు, కానీ గోవిందు భార్య కుండలో నీళ్లు ఇంట్లో ఇచ్చేది. ఇంట్లో నీళ్లు తీసుకోలేదు గానీ ఇంట్లోకి నీళ్లు తెచ్చి ఇచ్చేది, పిల్లల తిప్పలు చూడలేక నాలుగు కడవల నీళ్లు తెచ్చి ఇచ్చి వెళ్లేది.

వినాయక్‌కి చిన్నతనంలో ఊరబావిలోంచి నీళ్లు తాను మోసి తెచ్చుకోవటం గుర్తుకు వచ్చింది. తల్లి వంటి పల్లె తలలో తారాడితే కళ్లు నీళ్ల కుండలయ్యాయి. తల్లిపేగు నుంచి బొడ్డు కోసినట్లు పల్లె పేగు నుంచి వుద్యోగం కోసేసింది. గుంటూరు దగ్గర మెట్ట గ్రామంలో పుట్టిన వినాయక్ వుద్యోగం కోసం అనంతపురం వచ్చినపుడు శబ్దం నుంచి నిశ్శబ్దంలోకి వచ్చినట్లు భావించాడు. సమ్మె నుంచి విరమణలోకి దూకినట్టు కనిపించాడు. ఆందోళన నుంచి తీరుబడిలోకి తోయబడ్డట్లు అనుకున్నాడు. వేగం నుంచి ప్రశాంతతలోకి ప్రవేశించినట్లు అనుభూతి చెందాడు.

అక్కడి హరిజనులు హక్కుల కోసం పోరాడుతున్నట్లు ఇక్కడి వాళ్లు బ్రతుకుతెరువు కోసం పోరాడలేక పోతున్నారని స్పష్టంగా తెలిసి వచ్చింది. తాను రూం కోసం వెతుకుతున్నపుడు తన వాళ్లుండే చోట్లకు పోలేదు. వాళ్లతో వుండే పరిస్థితి తప్పిపోవటం మేలే అయింది. మిగతా వాళ్లతో మెలగటం నేర్చుకోవలసి వచ్చింది. కొన్ని గుణాలు రావటం చూస్తుంటే తానేమై పోతున్నానా అని మొదట్లో ఆందోళన పడ్డాడు.

ఆ రోజుల్లోనే భాగీరథి కలిసింది. మనస్సులు కలిశాయి. పెళ్లయింది. ఏ ఆర్భాటాలూ లేవు. మామూలుగా జరిగి పోయింది పెళ్లి. తల్లితండ్రులకు ఇరు పక్షాలా ఇష్టం లేదు. కష్టమూ లేదు. పెళ్లికి రాలేదు వాళ్లు. చూస్తుండగానే నలుగురు పిల్లలు- చదువులు- ఆనారోగ్యం- ఇల్లు- బావి. పెద్ద చదరంగంలో చిన్న పావులా కదులుతున్నాడు వినాయక్.

పెట్టే సంచితో అనంతపురంలో రైలు దిగిన ఒక్క మనిషి పదేళ్లలో ఆరుగురయ్యారు. బ్రతుకు మోయలేని సామానయింది. కదపలేని ఇల్లయింది. తవ్వలేని బావి అయింది. భాగీరథి సాంఘిక స్థాయి తనకు స్థాయి నిస్తుందని భావించిన అతడి ఆశ అత్యాశే అయింది. పైగా తన స్థాయి ఆమెకు కూడా సంక్రమించింది. అందుకే పిల్లలకయినా తన అవస్థ అంటుకోరాదని అతని ఆరాటం. తాపత్రయం.

ఒక రోజు భాగీరథి 'మన కులం ఆమెకెలా తెలిసిందో' అంది. గోవిందు భార్యను గురించి. అతను చెప్పాడు. 'మన కులం కాదు. నా కులం, ఆమెకు తెలుసు. నాకులం నేను రాక ముందే అనంతపురానికి తెలుసు. హరిజన లెక్చరరు గచ్చి చేరబోతున్నాడని ఆర్డరు వచ్చినపుడు కాలేజీకి తెలుసు. లెక్చరర్లకు తెలుసు. పిల్లలకు తెలుసు. ఊరంతటకీ తెలుసు. నా కులం, నా జాతకం నాకంటే ముందే ఇక్కడకు వచ్చింది. అనంతపురం నా కులం వాసన గాలిలో కలిసింది.

ఎవరు పీల్చినా ఇదే వాసన.

'కులం ప్రాధాన్యం నీకంతు పట్టినట్లు లేదు. మనిషి కంటె కులం ముఖ్యం . మనిషి ముఖంలోనే, నుదుటి మీదే కులం కనబడుతుంది. లేదా పేరుతో. ఉంటుంది. కాదా ప్రవర్తనలో ఉంటుంది, కాకపోతే కాగితాల మీద వుంటుంది. కులం తెలుసుకునే జనం మనిషితో మాటలు కలుపుతుంటారు. సంబంధాలు, బంధుత్వాలు, ఆత్మీయతలు స్నేహం చివరకు వైరం కూడా కులం పునాది మీదే! కులం వినా ఈ జనం సున్నా.

భర్త ఆవేశం గుర్తించింది. చల్లపరిచే మార్గం. కాఫీ. అంత ఇష్టం. మాటలు మాని కాఫీ తాగుతూ కూర్చున్నాడు.


అర్ధరాత్రి దాహమయింది. లేచి తల దగ్గరున్న చెంబులోంచి నీళ్లు తాగి కూర్చున్నాడు. అనంతంగా చీకటి అలుముకుని వుంది. ఎక్కడా చీమ చిటుక్కు మన్నా అలికిడి లేదు. దూరంగా అనంతపురం లైట్లు కనబడుతున్నాయి.

ఎక్కడిదో ఒక పిట్ట అర్ధరాత్రి నిద్ర లేచి గూడు వదలి, కూడుకో పీడకో రెక్కలు టపటప కొట్టుకుంటూ జమ్మి చెట్టు మీంచి లేచింది. దాని బతుకు తాపత్ర యానికి ఇంత రాత్రి సూర్యోదయమయింది. జమ్మి చెట్టు కాలిబాటలోవుంది, దానికింద పాముల పుట్ట. పుట్టనిండా పాములు. నాగుల చవితి వస్తే పూజలు కొదవ లేదు. అయినా పాములకు కొదవ లేదు. భయా నికీ కొదవ లేదు.

ఆ కాలిబాటే బళ్లబాట అయింది. సైకిళ్లు, కార్లు లారీలు ఆ బాటనే వస్తూ పోతూ వుంటాయి. అది ప్పుడు బాటకాదు. రోడ్డూకాదు. రెండూ అదే. అర్ధ నారీశ్వరత్వం. అనంతపురానికి నారాయణపురా నికి అదే తోవ. జమ్మిచెట్టు కింద శాశ్వతంగా పాముల భయం.

తల కింద రెండు చేతులూ పెట్టుకొని ఆకాశంలోకి చూస్తూ చుక్కలు లెక్క బెడుతున్నాడు. తేలే లెక్కా-తేలదు. బావి లెక్కలాగా. అల్లంత దూరంలో బావి కదలకుండా పడుకొని వుంది. రేపు మళ్లీ పని మొదలు. ఎంత లెక్క తింది? ఏమీ ఎరగనట్లు మౌనంగా వుంది. బావిపైగా, మట్టిగుట్ట పైగా అనంతపురం పైగా దేవర కొండ వైపు చూస్తున్నాడు వినాయక్. రేపు సూర్యో దయం నిరీక్షిస్తున్నాడు.

గుంతకల్లు నుంచి ధర్మవరం పోయే గూడ్సు తాటి చర్లలో కదిలినట్లుంది. సన్నటి ఈలలాంటి, వేణువు లాంటి, మురళిలాంటి పాటగా చుక్కుచుక్కు వినబడ సాగింది. అదీ గూడ్సే. ఇపుడొచ్చేరైలు లేదు. దొంగల బండి వెళ్లిపోయి ఉంటుంది. బైరాగుల బండి ముందే వెలిపోతుంది. ఇది గూడ్స్. చుక్కుచుక్కు క్రమంగా లయబద్ధంగా పెద్దది కాసాగింది. తడికలేటి మీదికి




వచ్చినట్లుగా వుంది. అవ్యక్త మధురంగా వున్న పాట సువ్యక్త మనధురంగా మారింది. శబ్దంలేని చీకటి రాత్రికి గూడ్సు శబ్దం సరిగమలకన్నా చక్కగా ఉంది. ఇంకా కొంచం సేపట్లో తెల్లవారుతుంది. గోవిందు కొడుకుతో భార్యతో వస్తాడు. తూటాలు పెడతాడు. పేలుస్తాడు. బండ పేలుతుంది. పగులుతుంది. పెచ్చులూడుతాయి. కనీసం బండకు నెర్రె పడు తుంది. నీళ్లు పొంగుతాయి. తాగేనీళ్ళు. దాహ బాధ. అతను ఆశ పడుతున్నాడు.

నిజమే! అతను ఆశాజీవే! బావిలో నీళ్లు పడ తాయి. అంతే కాదు. తమ భవిష్యత్తు బాగుంటుంది. ఆశ పడుతూనే వున్నాడు. ఆ ఆశల్ని, కలల్ని తియ్యగా తింటున్నపుడు పెద్దకూతురు ఏడుస్తూ వచ్చింది. ఏడుపు చూడలేక పోయాడు. బుజ్జగించాడు. ఏడుపు మాన్పించాడు.

ఆచార్యుల బార్యను కూతురు అత్త అనటం అత డికి ఆనందం కలిగించింది. పిల్లలంతా దొంగాట ఆడుకుంటున్నారు. దొంగ సై అన్నాడు. అత్తవాళ్ల ఇంట్లోంచి సై వినిపించింది. అందరూ పరుగు పరు గున పోయారు. అత్త వాళ్లింట్లో పాప చొరబడబో యింది. అత్త ఆపింది. అక్కడే వుండమంది. తన వెనక వచ్చిన పిల్లల్ని లోనికి పోనిచ్చింది. వాళ్లు దొంగను పట్టుకున్నారు. తనను పోనిచ్చి వుంటే తానే దొంగను పట్టుకుని వుండేది. ఆటంకం వల్ల అవలాశం పోయిం ది. కూతురు ఇంకా ఏడుస్తూనే వుంది,

'నీ కాళ్లకు మురికి వుండి వుంటుంది. అందుకే అత్త రానిచ్చి వుండదు.'

'అందరి కాళ్లకూ మురికి వుంది.'

'నీ కాళ్లకు ఎక్కువ దుమ్ము వుండి వుంటుంది.'

'ఏమో' అంది. 'దొంగ దొరికే వాడే.' అంది. 'పట్టుకోలేక పోయాను.' ఏడ్పు దిగమింగింది. 'అత్త చెడగొట్టింది.' ఏడ్చింది.

దొంగను తనే అందరి కంటే ముందు పట్టుకోలేక పోయినందుకు పాపకు నిరాశగా ఉంది. దిగులుగా వుంది. బాధగా వుంది. కోపంగానూ మారుతోంది.

దొంగను పట్టుకొనే అర్హత, అవకాశం, వేగం, చురుకుదనం వున్న తన కూతురు, తన వల్ల, తన అనర్హత వల్ల, నష్టపోయింది. పాప తన శక్తుల్ని తాను వినియోగించుకోలేక పోయింది. అర్హత వుండికూడా ఆటంకం కలగడం పట్ల కూతురి కంటె కూడా అతనికే ఎక్కువ ఆందోళనగా వుంది.

దొంగను పట్టుకుంటే ఆమె ఆటలో ఆలోచనలో వ్యక్తిత్వంలో నూత్న వికాసం వస్తుంది. పట్టుకొనే అవ కాశంలేక పోయి, తనకు తెలియకుండా తను కారణం కాకుండా ఆటంకం ఏర్పడి, తన సామర్థ్యం మీద, తన ప్రయత్నం మీద, తన కృషి మీద పాపకు సందే హం కలుగుతుంది. ఇటువంటివి అనేకం జరి గితే ఏమైనా వుందా!


ముళ్లకంప అడ్డం పడ్డ మొక్క వంగి పోయినట్లు తన కూతురు జీవితం, వ్యక్తిత్వం, వికాసం, భవిష్యత్తు ఇలా ఆటంకాలకు గురి అవుతాయా? ఇది ఎటు వంటి ముద్ర వేస్తుంది? అతను ఆలోచించలేక పోయా డు.

'చూశారా?' భాగీరథి అడిగింది.

'విన్నాను.'

'పిల్లల్ని ఎవరిళ్లకూ పోనివ్వ వద్దంటే మీరు వినరు.'

'వింటాను. పోనీయ్. మంచి చెడ్డలు వాళ్లకే




తెలియనీయ్'

'మనమే చెబితే?'

'పిరికి మందు నూరిపోయటమే!'

'వాళ్లు బాధ పడతారు'

'రాటు దేలుతారు.'

'ఏమో- ఏం పరిణామాలో'

'పిల్లలు వాళ్లంతట వాళ్లే- కాలనీ వాళ్లనుంచి వాళ్ల స్థితిని తెలుసుకోనీయ్. పిరికి వాళ్లయి ధైర్యం నూరి పోద్దాం. ధైర్యంగా వుంటే ప్రోత్సహిద్దాం. ప్రతిఘటిస్తుంటే నెమ్మదిగా వుండటం నేర్పుదాం. వాళ్లకు పట్టుదల రానీ, పౌరుషం రానీ, దీక్ష రానీ, వాళ్లు కార్యసాధకులు కానీ, వీళ్లు తల వంచుకోరాదు. విర్రవీగరాదు. అసమర్థత రారాదు. అతిశయం వుండరాదు. మేం ఎవరి కంటేనూ తక్కువ కాదు అని మాత్రమే కాదు, మాకంటే ఎవరూ ఎక్కువ కాదు అనుకునేటట్లు పెరగనీ. మేం ఎవరి కంటేనూ ఎక్కువ కాదు అని మాత్రమే కాదు, మా కంటే ఎవరూ తక్కువ కాదు అనుకొనేటట్లు పెరగనీ. ఇందిరాగాంధీ నీ కంటే ఏమెక్కువ? ఆమెకుండే అవకాశాలు నీకు వుంటే నువ్వు ఆమె కంటే తక్కువ కాదు. ఆరాట పడాలి. పోరాడాలి. సాధించాలి. అతిశయ పడకూడదు. అహంకారం చూపకూడదు, గర్వం గుండెను కాటేయ రాదు. తల పొగరెక్కరాదు. నాకు నమ్మకముంది. ఇన్ని అసౌకర్యాల మధ్య అవస్థల మధ్య ఆటంకాల మధ్య జీవన పోరాటం సాగించే వీళ్లు చాలా మంది కంటే సమర్థులవుతారు. కావాలి' భార్య ఆప్యాయంగా తల నిమురుతూ కూర్చుంది.

ఉన్నట్టుండి చిన్న కూతురు పరుగు పరుగున వచ్చింది.

'నాన్నా! నేను సిన్నోళ్లింటికి పోను'

ఏదో జరిగిందని అర్థమై పోయింది. ఇలా జరగటం మామూలై పోయింది. కూతురు ఏడవటం లేదు. అదే పదివేలు. సిన్ని అంటే శాస్త్రి భార్య. కాలనీలో వుండే ఆడవాళ్లంతా మగవాళ్లందరూ చిన్నా చితకా ముసలీ ముతకా అందరిని వరసలు కలిపి పిలుస్తుంది చిన్నకూతురు, వాగుడుకాయ.

మనుషులందరినీ బంధువుల్లా పలకరించటం వినాయక్‌కి చిన్నతనంలో అలవాటు కాలేదు. మానవ సంబంధాలలో ఆత్మన్యూనతా భావం కాని, ఆత్మాధిక్యతా భావం కానీ లేకుండా పిలవటం తలవటం పలకటం పలకరించటం అతను చాలా కష్టపడితే కాని సాధించలేక పోయాడు. కూతురు సునాయాసంగా బంధుత్వాలు కలుపుతుంటే అతనికి సంతోషంగానే వుంది.

'నువ్ నా మాటింటివా? ఇన్లే!' అంది చిన్న కూతురు.

'వింటాను చెప్పు'

సిన్ని అందరికీ నీళ్లిచ్చింది. అందరు గ్లాసులు కడిగి, తొరిసి తీసుకొని పోయింది లోనికి. నా గ్లాసు బండ మీద పెట్టించింది.

నీళ్లిచ్చినందుకు సంతోషం 'ఏం ప్రత్యేకత?'

'అవ్వ కడిగి లోన పెట్టింది. అవ్వ. పనవ్వ. రాయుడోళ్లవ్వ.' కూతురికి లోకం అర్థమవుతూ వుంది.

'నువ్వంటే ఏమనుకున్నావు మరి. స్పెషల్. నీ గ్లాసులు పని వాళ్లు కడగాలి. అంటే నువ్వు పని వాళ్లను పెట్టుకోవాలి. అంటే పెద్ద వుద్యోగం చేయాలి. అంటే పెద్ద చదువులు చదవాలి. సిన్ని నిన్ను ఆశీర్వదించింది.'

కూతురు నమ్మలేదు.

చిన్న కూతురు తండ్రిని ఆశ్చర్యంగా చూడలేదు. ఓ అమాయకుణ్ణి చూచినట్టు చూచింది. బుడుక్కున వంగి ముద్దు పెట్టుకుని ఇంట్లోకి పరుగెత్తింది.

ఇటువంటి సందర్భాలు అనేకం. పిల్లల తల్లి వుడికిపోతూ వుండేది. పట్టరాని కోపం తెచ్చు కునేది. భర్తను పగిలే అగ్ని పర్వతం అనుకునేది. పొగ రాదు. వేడి లేదు. పగలదు. లావా లేవదు. దగ్ధం చేయదు. అయితే ఎప్పుడీ అగ్ని పర్వతం బద్దలవుతుందో అన్నట్లుగా వుండేవాడు.

అతను ఎన్నో ఓర్చుకునేవాడు. ఏ మనిషయినా ఎంత ఓర్చుకోగలడు. కొంత ఓర్పు మించితే గుండె భరిస్తుందా? శరీరం మోస్తుందా? కాలిపోతూ చల్లగా వుండడం ఈ మనిషికి ఎట్లా సాధ్యమయిందా అని ఆమె ఆశ్చర్య పోతుంది.

ఆ రోజు ఆదివారం. అందరూ ఇంట్లోనే వున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు. చుట్టుపక్కల వాళ్లు తమ ఇంటికి వచ్చి ఆడుకుంటూ వున్నారు. అలసి పోయి దాహం అడిగారు. కూతురు అందరికీ నీళ్లు ఇచ్చింది. అందరూ తాగారు. అందరి గ్లాసులూ తానే కడిగి లోన పెట్టింది.

పిల్లలు పిడుగుల్లా మెట్ల మీద, మేడ మీద ఒకటే దూకుడు. ఎగురుడు. ఆటలు పాటలు, ఇల్లు పీకి పందిరేస్తున్నారు. మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్న భాగీరథి అశాంతిగా కదిలింది. అది అనర్థకమయ్యే ప్రమాదం వుంది. ఆమె పిల్లల్ని, వాళ్ల అల్లర్ని తిట్టే ప్రమాదం వుంది, పిల్లలు ఇంటికి రావటం, ఆడుకోవటం, నీళ్లు తాగటం అనికి ఇష్టం. వాళ్లను తిట్టి తరిమేయకుండా చూడటానికి భార్య దగ్గరకు వచ్చి కబుర్లు ప్రారంభించాడు. ఆమె అశాంతి తగ్గిం ది. పిల్లల్ని తిట్టలేదు.

వాళ్ల అల్లరి ఎంతో ముచ్చటగా వుంది. చిలుక పిల్లలు, పిచిక పిల్లలు కిచకిచలాడినట్లుంది. వాళ్లెంత హాయిగా ఆడుకుంటున్నారు! లోకం తెలియదు. అమాయకులు. వీళ్లు పెద్దవుతారు. అన్నీ తెలుస్తాయి. హెచ్చుతగ్గులు గుర్తిస్తారు. భేదాలు, విభేదాలు అంతు పడతాయి. ఆ గొడవ జీవితం ఆరంభమవుతుంది. ఈ లోగా కనీసం ఇలాగా వీళ్లు బతకటం ఎంత అదృష్టం! వీళ్లు ఇలాగ్గే, ఇంత సుఖంగా, ఇంత అమాయకంగా, ఇంత అన్యోన్యంగా, ఇంత ఆత్మీయంగా కలిసి మెలిసి ఉండేటట్టు చేసే మార్గమే లేదా? ఏ కులమూ, మతమూ లేని పిల్లల్లాగా వీళ్లను పెంచలేమా? కుళ్లు కల్మషం రాకుండా చూడలేమా! అతను దిగులుగా వున్నాడు.


అంతలోనే ఆనందం. వీళ్లతో వీళ్లందరితో తమ పిల్లలు నలుగురూ కలిసి ఆడుకొంటున్నారు. పాడు కొంటున్నారు. ఉత్తుత్తి అన్నం వండుకుంటున్నారు. తింటున్నారు. లేని నీళ్లు తెచ్చు కుంటున్నారు. తాగు తున్నారు. లేని పరుపపులు మీద పడుకొంటు న్నారు. ఎండలో, నాప బండల మీద, హంస తూలికా తల్పం మీద శయినించినట్లు భావిస్తున్నారు. వేపచెట్టు నీడ కల్ప వృక్షచ్ఛాయగా తలపోస్తున్నారు. వీళ్లెంత అదృష్ట వంతులు.

తనకా అదృష్టం కలిగిందా? తనలా ఆడుకునే వీలు చిక్కిందా? చిన్నతనంలో పిల్లలు ఆడుకొంటుం టే తాను దూరం నుంచి చూచే వాడు. ఆనందించే వాడు. దగ్గరకు పోయేవాడు కాదు. పోతే వాళ్లు వెళ్లి పోతారు. ఆట మానతారు. వాళ్ల ఉత్సాహం పాడై పోతుంది, వాళ్ల ఆటలు చెడగొట్టే వాడు కాదు. వాళ్లతో ఆడుకోలేక పోతున్నానే అనే బాధ పడ్డ మాట వాస్తవమే. కాళ్లులేని వాళ్లు పరుగెత్తక పోయినా పరుగు పందెం చూసి ఆనందించినట్లు ఆనందించే వాడు. ఆడక పోయినా ఆట చూచి ఆనందించటం నేర్చుకున్నాడు.

తనకు కాళ్లూ చేతులూ అన్నీ సక్రమంగా వున్నా యి. ఉత్సాహం వుంది, వాళ్లతో తానూ ఆడుకోగలడు. ఆడే శక్తి వుంది, ఓపిక ఉంది. ఆశ ఉంది. ఇష్టం ఉంది. అవకాశం లేదు. అదే బాధ. అది అతన్ని కాల్చుకుని తినలేదు. తనకంతే అనుకొన్నాడు. తమ కంతేనని తెలుసుకున్నాడు. ఇది చాలు, ఇలా చాలు, ఇంతకంటే ఏమీ వద్దని, ఏమీ చేయలేక తనను తాను సర్దుబాటు చేసుకునే వాడు. కానీ నిరాశ మాత్రం మిగి లే వుండేది.

ఇప్పుడు చిన్న పిల్లవాడు అయిపోయి, మాన సికంగా వాళ్లతో ఆడుకుంటున్నట్లే వున్నాడు. పరుగెత్తుతున్నాడు. పడుతున్నాడు. లేస్తున్నాడు. అంతా ఇష్టా రాజ్యం.

తీరుబడిగా చూస్తే తన పిల్లలు తనకు లేని అదృ ష్టం పొందారు. వాళ్లు ఆడుకుంటుంటే ఆనందం గావుంది. తానూ ఆడుకుంటున్నట్టే వుంది. తన




నలుగురు పిల్లల రూపంలో తానూ ఆడుకుంటు న్నాడు. తానొక్కడూ నలుగురై ఆడుకొంటు న్నట్లు ఆనందం!

ఆ ఆనందం అంచుల మీద కాగితం పడవలా తేలిపోతున్న వినాయక్‌కు లోకం గుర్తుకు తెచ్చింది డెయిరీ పాల లారీ. తెల్లవారరు జామునే వచ్చే లారీ కీచుమంటూ ఇంటి ముందే ఆగింది. దాని రాక సైరన్ మోతలాగా వినిపిస్తుంది. ఒక్కొక్క ఇంట్లో లైట్లు వెల గటం ప్రారంభమయింది. పాల సాచెట్ కోసం వస్తూ పోతూ జనం సందడి మొదలయింది.

నారాయణపురం నుంచి అనంతపురం పోయే పాలకేన్లు సైకిళ్ల మీద ఉన్నాయి. బెల్లులు మోగు తున్నాయి. గంపల్లో పాలూ పెరుగూ తీసుకు పో..., అమ్ముకునే వాళ్ల కదలికలు మాటలు పెరుగుతు న్నాయి. అప్పుడొకటి ఇప్పుడొకటి ఎడ్ల బళ్లు కూడా వస్తూ పోతూ ఉన్నాయి.

అనంతపురానికి, తపోవనానికి మధ్య గీత గీసినట్లు వేస్తున్న బైపాసు రోడ్డుకు కంకర తోలుతున్న లారీల రాకపోకలు రద్దీ పెద్దగానే వినబడుతూ వుంది. ఇళ్ల ముంగిళ్లలో, చెట్ల కింద, ఆరుబయల్లో మంచాలేసు కున్న వాళ్లు ఇళ్లలోకి మకాం మార్చుకుంటున్నారు. ఇంకా అయిదు గంటలు కాలేదు. స్కూలు పిల్లలు మేల్కొన్నారు. పాఠాలు వల్లిస్తున్నారు.

ఆచార్యులు లేచాడు. గుర్తు దగ్గు. రాత్రి సమ యంలో ఎక్కడ నిద్ర పోతుందో ఏమో కానీ ఆచార్యులు నిద్ర లేస్తే దగ్గు కూడా నిద్ర లేచి వస్తుంది. ఇంట్లో వాళ్లని అతను లేపే పని లేదు. దగ్గే లేపుతుంది. ఆచార్ల దగ్గు తగ్గదు. ఆగిపోదు. నయం కాదు. దగ్గు అతడి వంట్లో ఒక అవయవమై కూర్చుంది. అతను దగ్గును ఆరోగ్యంగా పోషించుకొంటున్నాడు.

ఇళ్ల ముందు నీళ్లు చల్లుతున్న చప్పుళ్లు వినబడు తున్నాయి. నీళ్లు పడి, నిద్ర లేచి, అరిచి, వళ్లు విదుల్చుకునా, వీధి కుక్కలు కాలనీ సింహాలు అయ్యా యి. బృహదీశ్వరాలయంలో తలుపులు తెరిచినట్లు న్నారు.

కాలనీ పుడుతూనే గుడి పుట్టింది. హిమాలయాల నుంచి శివలింగం వచ్చింది. ప్రతిష్ఠ జరిగింది. పూజా రి పుట్టాడు. నిత్యనైమిత్తిక కర్మకాండ ప్రారంభమ యింది. ధూపదీప నైవేద్యాదులకు కొదవ లేకుండా పోయింది. నైవేద్యం పెడుతుంటే చాలు. అంతమంది పిల్లలు కాలనీలో ఎక్కడున్నారో అంత పెద్ద క్యూ!

శాంతమ్మ వచ్చి ఎదురుగా నిలబడి, ఒక రోజు 'అయ్యా' అని అంది. అప్పుడే పిల్లలు నైవేద్యంతో వచ్చి ఇంట్లో పంచుతున్నారు. చేతులు నులుంకొంది.



## స్వీట్ బేబీ ఊర్మిళ

*నేను 'మామ్' అని పిలిచే ఊర్మిళ నీట్ బేబీ. సెట్స్‌లో చాలా కూల్‌గా ఉంటుంది. అన్నాడు కండలు తిరిగిన సంజయ్ దత్– తన సరసన నటించిన హీరోయిన్లను గురించి చెబుతూ. 'దౌడ్' షూటింగ్‌మా ఇద్దరికీ ఒక పిక్నిక్‌లా సాగింది. (పక్కన సరసాంగి ఉంటే పిక్నిక్ కాక ఇంకేమవుతుంది!) మేం ఇద్దరం కలిసి 'ఖుబ్సూరత్'లో నటించాం. ఇది ఒక ఫన్ సినిమా.*

## టైం బాగాలేదు

డేరింగ్ సెక్సీగాళ్ మనీషాకొయిరాలా తనకు జ్యోతిషం మీద గురి లేదంటూనే తన సినివూలు హిట్ కాకపోవడానికి టైం బాగాలేదంటోంది. నా సినిమాలు ఎందుకు ఫ్లాప్ అయ్యాయో నాకు తెలీదు. ఇది నా బాడ్‌లక్ టైం. హస్త సాముద్రికాన్ని నేను నమ్మను కానీ మా మమ్మీకి ఒక జ్యోతిషుడు ఇప్పుడు నాకు బ్యాడ్ పీరియడ్ నడుస్తోందన్నాడుట. బహుశా అందుకనే నేమో నా సినిమాలు హిట్ కావడం లేదు. (ఇదేంటో రెండు నాల్కల వ్యవహారంలా ఉందే)



తల గీరుకొంది. పైటకొంగుకు చేతులు తుడుచుకొంది. కసువువూడ్చి, అంట్లు తోమి వచ్చింది.

'డబ్బు కావాలా' అన్నాడు వినాయక్. 'కాదు' అంది. రేపట్నించి పనికి రానంది. రాలేనంది. రాని య్యరంది. మీరంటే ఇష్టమేనంది. పని మానటం ఇష్టం లేదంది. కానీ తప్పదంది.

'ఎందుకని!' అడిగాడు. 'జీతం చాలటం లేదా?' ప్రశ్నించాడు. కాదంది. పైటకొంగు చేతికి చుట్టుకొంది. మూతికి చేయి అడ్డం పెట్టుకుంది. నెమ్మదిగా నోరు తెరచింది. 'అయ్యా' అంది. 'ఊ(' అంటే 'మీర రిజనులా? 'అని ప్రశ్నించింది. పైటచెంగు కొంగు అంతా నోట్లో కుక్కుకొంది. కళ్లలో నీళ్లు తిరిగాయి.

అతనికి విషయం అర్థమై పోయింది. ఆమెను చూస్తుంటే కళ్లలో నీళ్లు తిరిగాయి. కళ్లు కనిపించటం లేదు. దృష్టి మందగించింది. చూపు లేదు. మసక. పొగమంచు. చలి.. ఎదుటి మనిషి కనిపించటం లేదు.

శాంతమ్మ ఏడుస్తుందనిపించింది. వున్నట్టుండి వంగింది. కాళ్లు తాకింది. కాళ్లు వెనక్కు లాక్కున్నాడు. లేచి, వంగి, తప్పుకొని తలుపు దాకా పోయింది. వెను దిరిగి చూచి వెళిపోయింది, ఆ రోజు మిగిలిన అన్నం శాంతమ్మ తినలేదు. తీసుకుని పోలేదు.

మూణ్ణెల్లు పని చేసింది. తల్లో నాలుక. మంచి మనిషి. ఇంట్లో అందరికీ ఇష్టం. పొద్దుటా సాయంకాలం వచ్చేది. మిగిలిన అన్నం తినేది. ఇంకా ఉంటే తీసుకుని పోయేది. కసువు ఊడ్చటం, అంట్లు తోమటం ఫర్వాలేదు. నీళ్లు తెచ్చేది. నీళ్లే సమస్య. ఆమె లేకపోతే నీళ్లతో పెద్ద కష్టం.

మళ్లీ మామూలే. పని మనిషి కోసం వేట. ఎవరో దొరికే వాళ్లు. పది రోజులు పని చేసే వాళ్లు. అంగడికి పోయినపుడో నీళ్లకు పోయినపుడో ఎవరెవరో ఏమేమో అడిగే వాళ్లు. ఏమేమో చెప్పే వాళ్లు.

వాళ్లూ వీళ్లు అన్నవీ విన్నవీ కొందరు అడిగే వాళ్లు. కొందరు అడక్కుండా మానేసే వాళ్లు. పని వాళ్లతో కష్టంగా వుందంటే తోటి లెక్చరరు పల్లెనుంచి పిల్లవాడిని పిలిపించాడు. పిల్లవాడు చురుకుగా వున్నాడు, చలాకీగా వున్నాడు. బలహీనంగా దిగులుగా వచ్చాడు, తిండి లేదు, బట్ట లేదు. పెరిగే వయస్సులో పిల్లవాడు వంగిపోయాడు. చదువూ లేదు. వూళ్లో గొడవలు తెస్తున్నాడు. దొంగ బుద్ధి. జాగ్రత్త అని హెచ్చరించాడు, తోటి లెక్చరరు.. హరి జనుల పిల్లవాడు.

పిల్లవాడు పని బాగా నేర్చుకున్నాడు. ఆరోగ్యం కుదుట బడింది. కొత్త బట్టలు వచ్చాయి. కంటికి నిద్ర దొరికింది. కడుపుకు కూడు కుదిరింది. అతనికి పిల్లవాపంటే ప్రేమ. అవసరమై ప్రేమ కొంత. అతడి హరిజనత్వం మీద జాలి కొంత. మొత్తం మీద వాణ్ణి బాగా చూసుకుంటున్నారు. వాడి చదువు మీద, భవిష్యత్తు మీద అతను దృష్టి సారించాడు.

మీరు ఫలానా అంట గదా, మీ ఇంట్లో నేను పని చేయగూడదంట గదా అని పని మానేసి పల్లెకు వెళ్లి పోయాడు, అతడి కళ్లు చెమ్మగిల్లాయి.

సొంత ఇంటికీ రాకముందు, అద్దె ఇంటిలో వున్నపుడు ఇంట్లో బీబీ పని చేసేది. ఇంట్లో అన్ని పనులూ చేసేదీ. దొంగతనం చేసిందని ఆమెను పని మాన్పించింది భాగీరథి. పని మానటం ఇష్టం లేక ఏడుస్తూ పని మానింది బీబీ. పని వాళ్లతో విసుగు రావటంతో మళ్లీ బీబీకి ఆమె కబురు పంపింది. ఆగమేఘాల మీద వచ్చింది బీబి. పెట్టె సంచీ తీసుకుని మరీ వచ్చింది. ఇంట్లో వుండి పోవటానికే వచ్చింది, తపోవనంలో పనిచేసి రోజూ రైలు స్టేషనుదాకా వచ్చి పోవాలంటే అయ్యే పని కాదు. భాగీరథి రాజీపడింది. బీబీని రానిచ్చేది కాదు. దొంగ బుద్ధి వున్నా మన జాగ్రత్తలో మనముంటే సరిపోతుంది కదా- ఆమె సర్దుబాటు చేసుకుంది. పైగా ఇంట్లో తాము లేనప్పుడు మనిషి వుండటం మంచిదే కదా! ఇల్లు కొంచెం పెడగా కూడా వుంది. మళ్లీ పని వాళ్లతో సమస్య రాలేదు. గొడ్డు చాకిరీ చేసేది. వస్తాదు లాగా తినేది. దెయ్యంగా నిద్ర పోయేది. భర్త వదిలేశాడు. పిల్లాజెల్లా లేరు. తల్లితండ్రుల దగ్గరకు పోదు, వాళ్లు రారు. ఏభై ఏళ్ల దాకా వున్నా ఆరోగ్యం చెడలేదు. ఒక్క రోజు కూడా తుమ్మలేదు. దగ్గలేదు. ఆకొక్క పుగాకు నములుతుంది. నోటినిండా ఆకొక్క ఎప్పుడూ ఉంటుంది. అదే అవస్త. ఆమె దగ్గర పిల్లలంతా మాలిమి.

వినాయక్ మంచం ఇంట్లోకి తెచ్చుకుంటున్నపుడు బీబీ ఇంటి ముందు నీళ్లు చల్లుతూ వుంది. చెంబు జానకమ్మకిచ్చాడు. టేబిల్ దగ్గర కూర్చుని హోం వర్కు చేసుకుంటున్న వాళ్లను చూస్తూ ఉన్నాడు. చివరి వాడు మాత్రం అమ్మ ఇంకా పక్కలోనే వుందనుకొని నిద్రను వాటేసుకుని పడుకున్నాడు.

**(ఇంకావుంది)**

